ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
శనివారం 20 జనవరి 2024 | 3



నేడు మండపేటలో
రా..కదలిరా..!
- చంద్రబాబు భారీ బహిరంగ సభ
- లక్ష మంది జన సమీకరణే లక్ష్యంగా టీడీపీ, జనసేన ఏర్పాట్లు

- 5లో

టిక్కెట్ ఫ్లీజ్!



- అసెంబ్లీ ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ సీట్ల కోసం నేతల పాట్లు
- వైసీపీలో సీటు చిరిగిన ముగ్గురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఎగతెగని ప్రయత్నాలు
- టీడీపీ లేదంటే జనసేన నుంచి సీటు కోసం జగ్గంపేట ఎమ్మెల్యే చంటిబాబు పావులు
- జనసేన నుంచి టిక్కెట్ తెచ్చుకునేందుకు పెండెం దొరబాబు విశ్వప్రయత్నాలు
- ప్రత్తిపాడు సీటు పోవడంతో ఎమ్మెల్యే పర్వత టిక్కెట్ కోసం వెదుకులాట
- చివరి నిమిషంలో వైసీపీ టిక్కెట్ వస్తుందంటూనే ప్రత్యామ్నాయాల అన్వేషణ
- జనసేన తరపున ప్రత్తిపాడునుంచి ముద్రగడ కుటుంబం పోటీ అంటూ ప్రచారం
- 25న పవన్ అమలాపురం పర్యటన నేపథ్యంలో కొంత స్పష్టత వచ్చే వీలు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో టిక్కెట్ల కోసం పలువురు నేతలు ముమ్మరంగా పావులు కదుపుతున్నారు. ఏదొక పార్టీలో చేరి సీటు తెచ్చుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా వైసీపీలో టిక్కెట్‌లు కోల్పోయిన ముగ్గురు సిట్టింగ్ ఎమ్మెల్యేలనుంచి పలువురు ఆశావహుల వరకు సీటు దక్కించుకోవడమే ధ్యేయంగా అడుగులేస్తున్నారు. తమ పరపతి ఉపయోగించి ఎక్కడో చోటనుంచి బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో జిల్లాలో పలు అసెంబ్లీ స్థానాలనుంచి నేతల సీట్ల పోటీ పెరిగింది. వైసీపీ నుంచి టిక్కెట్‌లు కోల్పోయిన పిఠాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు వైసీపీ ఎమ్మెల్యేలు అయితే హైదరాబాద్, అమరావతిలో మకాం వేసి రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న తాము వచ్చే ఎన్నికలకు టిక్కెట్ లేకుండా ఉండడం అయ్యే పని కాదని ఆలోచనతో అడుగులు వేస్తున్నారు. టీడీపీలో సీట్లు ఖాళీ లేక పోయినా ఓ రాయి విసురుతున్నారు. అటు జనసేనలోను టిక్కెట్ ప్రయత్నాలు చేస్తున్నారు. జగ్గంపేట ఎమ్మెల్యే చంటిబాబు ఇప్పటికే పవన్‌ను కలిశారు. పిఠాపురం ఎమ్మెల్యే జనసేననుంచి టిక్కెట్ వస్తుందనే నమ్మకంతో పావులు కదుపుతున్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత ఆఖరి నిమిషంలోనైనా వైసీపీ నుంచి టిక్కెట్ వస్తుందని చెబుతూనే, టీడీపీ, జనసేనల వైపు చూస్తున్నారు. అటు ముద్రగడ జనసేనలో చేరడం ఖాయమైన నేపథ్యంలో ప్రత్తిపాడునుంచి ఆయన కుటుంబం బరిలో ఉంటుందని ప్రచారం జరుగుతోంది. ఈనెల 25న పవన్ అమలాపురం పర్యటన నేపథ్యంలో తమ సీటుపై స్పష్టత వస్తుందనే ఆశతో పలువురు నేతలున్నారు.

ఎలాగైనా పోటీ చేయాల్సిందే..

అసెంబ్లీ ఎన్నికలకు ముహూర్తం దగ్గర పడడంతో నేతల్లో టిక్కెట్ల టెన్షన్ ఎక్కువైంది. రాబోయే ఎన్నికల్లో కచ్చితంగా పోటీ చేసి తీరాలనే పట్టుదలతో ఎవరికి వారే సీటు ప్రయత్నాల్లో స్పీడు పెంచారు. అటు వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రావడం ఖాయమనే అంచనాల నేపథ్యంలో ఎవరికివారే నేతలు ఈ రెండు పార్టీల్లో ఎక్కడో దగ్గర నుంచి సీటు దక్కించుకోవాలని ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. వీరిలో ప్రధానంగా వైసీపీ నేతలు ఎక్కువగా టిక్కెట్ కోసం పావులు కదుపుతున్నారు. ఇటీవల వైసీపీలో టిక్కెట్ల కేటాయింపులో భాగంగా ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గంపేట ఎమ్మెల్యేలకు జగన్ షాక్ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి వీల్లేకుండా టిక్కెట్లు చింపేశారు. దీంతో వీరు ముగ్గురు ప్రత్యామ్నాయ మార్గాల్లో తలమునకలయ్యారు. ఇప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న తాము రేపు వచ్చే ఎన్నికల్లో అసలు టిక్కెట్ లేని పరిస్థితి ఎదుర్కొన డాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఇదే గనుక జరిగితే క్యాడర్‌ను సైతం కోల్పోయి రాజకీయంగా మళ్లీ సున్నాకు వస్తామన్న భయం వీరిని వెన్నాడుతోంది. ఈ నేపథ్యంలో టిక్కెట్ ఎలాగైనా తెచ్చుకోవడానికి నానా ప్రయత్నాలు చేస్తున్నారు. జగ్గంపేట ఎమ్మెల్యే చంటిబాబు టీడీపీ టిక్కెట్‌కు ప్రయత్నించారు. కానీ జగ్గంపేట టిక్కెట్ అవకాశం లేకపోవడంతో ఇటీవల పవన్‌ను కాకినాడలో కలిశారు. జగ్గంపేట టిక్కెట్ లేదంటే కాకినాడ ఎంపీ సీటు కోరారు. కానీ ఈ రెండింట్లో ఏదీ హామీ రాలేదు. ఈ నేపథ్యంలో పవన్ స్పందన కోసం ఎదురు చూస్తున్నారు. పిఠాపురం ఎమ్మెల్యే దొరబాబు టీడీపీలో చేరే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో జనసేన వైపు అడుగులు వేస్తున్నారు. పిఠాపురం సీటు కోరుతున్నా అవకాశం లేదని తేలిపోవడంతో ఏదొక చోటనుంచి బరిలోకి దిగేందుకు ప్రయత్నిస్తున్నారు. అటు కాకినాడ సిటీ నుంచి అవకాశం ఉందేమో అన్న కోణంలోను పావులు కదుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ తనకు ఆఖరి నిమిషంలో అయినా వైసీపీ టిక్కెట్ దక్కుతుందనే ఆశతో ఉన్నారు. ప్రత్యామ్నాయంగా ఉన్న టీడీపీ, జనసేన వైపు కూడా చూస్తున్నట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు. కానీ అక్కడా దారి కనిపించకపోవడంతో అడుగులు ఎటు అనేది తేల్చుకోలేకపోతున్నారు.

పవన్ రాకతో స్పష్టత వచ్చే అవకాశం..

వైసీపీ తీరుతో విసుగెత్తిపోయిన కాపు ఉద్యమనేత ముద్రగడ టీడీపీ, జనసేనలో చేరుతారనే ప్రచారం జరిగింది. కానీ ఇటీవల పరిణామాలు ఆయన జనసేన వైపు చేరుతారనే దానిపై స్పష్టతనిచ్చాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే పలువురు జనసేన నేతలు ముద్రగడతో భేటీ అవడంతో పార్టీలో చేరిక ఖాయంగా తేలిపోయింది. ఈ నేపథ్యంలో ఈనెల 25న పవన్ అమలాపురం పర్యటన నేపథ్యంలో ముద్రగడ నివాసానికి వచ్చి జనసేన లోకి ఆహ్వానించే అవకాశం ఉందని ప్రచారం బలంగా జరుగుతోంది. ఈ మేరకు ఇదే విషయాన్ని పలువురు జనసేన నేతలు ముద్రగడకు వివరించినట్లు తెలిసింది. అటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన అధ్యక్షుడు కందుల దుర్గేష్ నివాసానికి పరామర్శకు గురువారం రాజమహేంద్రవరానికి వచ్చిన నాదెండ్ల మనోహర్‌ను ముద్రగడ కలవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. జనసేన పార్టీకి ముద్రగడ పద్మనాభం చేరువయ్యారనే సంకేతాలు ఈ భేటీ ద్వారా వెల్లడైందని చెబుతున్నారు. జనసేనలో చేరిక తర్వాత ముద్రగడ కుటుంబం ప్రత్తిపాడు సీటునుంచి బరిలోకి దిగుతుందనే ప్రచారం ఎక్కువగా జరుగుతోంది. తొలుత పిఠాపురం అసెంబ్లీ, కాకినాడ ఎంపీ సీటు అని ప్రచారం జరిగినా కొంతకాలం కిందట ముద్రగడ, ఆయన తనయుడు విడివిడిగా ప్రత్తిపాడు నియోజకవర్గంలో పర్యటించారు. అక్కడ పలువురితో సంప్రదింపులు కూడా జరిపారు. ఈ నేపథ్యంలో ప్రత్తిపాడు సీటుపై ఆసక్తి ఎక్కువగా కనబరుస్తున్నారని, ఈ నేపథ్యంలో ఇక్కడినుంచి ముద్రగడ తనయుడు బరిలోకి దిగవచ్చనే ప్రచారం జరుగుతోంది. జనసేనలో ముద్రగడ చేరిక అన్‌కండీషనల్ అని ఆయన అనుచరులు చెబుతున్నారు. ఈనెల 25న పవన్ కల్యాణ్ పర్యటన తర్వాత జనసేన నుంచి సీట్లు ఆశిస్తున్న పలువురు నేతలకు కొంత వరకు స్పష్టత వచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీమంత్రి పితాని సత్యనారాయణ.. పాల్గొన్న బీసీలు

బీసీలకు సముచిత స్థానం కల్పించింది టీడీపీనే..

- మాజీమంత్రి పితాని సత్యనారాయణ
- ఇంద్రపాలెంలో 'జయహో బీసీ' సమావేశం
- అధికసంఖ్యలో పాల్గొన్న బీసీ నాయకులు

కాకినాడ రూరల్, జనవరి 19: రాష్ట్రంలో బీసీలకు సముచిత స్థానం కల్పించింది టీడీపీ అధ్యక్షుడు దివంగత ఎన్టీఆర్, చంద్రబాబు అని బీసీలంతా ఏకమై టీడీపీకి మద్దతు పలకాలని రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యులు, బీసీ సాధికార కమిటీ కన్వీనర్ పితాని సత్యనారాయణ కోరారు. రూరల్ మండలం ఇంద్రపాలెంలోని పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి కన్వెన్షన్ హాల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్తిబాబు అధ్యక్షతన జయహో బీసీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పితాని సత్యనారాయణ, టీడీపీ బీసీ సాధికార శెట్టిబలిజ విభాగం కన్వీనర్ కుడిపూడి సత్తిబాబు, కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, రాష్ట్ర పెరికి సంఘం కన్వీనర్ బద్రి పాల్గొన్నారు. మొదటిగా అతిథులు జ్యోతిరావ్‌పూలే, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి పితాని మాట్లాడుతూ వైసీపీ పాలనలో బీసీలు మరింత వెనుకబడిపోయారని బీసీల సంక్షేమానికి ఆనాడు చంద్రబాబు అనేక సంక్షేమ పథకాలు, కార్పొరేషన్ల ద్వారా చేయూత అందించారన్నారు. నేడు రాష్ట్ర ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా బీసీలను చిన్నచూపు చూస్తోందని తెలిపారు. అనంతరం కొండబాబు మాట్లాడుతూ సీఎం జగన్ బీసీలను నమ్మించి మోసం చేశారన్నారు. బీసీలకు సంబంధించిన 75వేల కోట్ల నిధులను దారి మళ్లించారని తెలిపారు. బీసీలకు 34శాతం ఉండాల్సిన రిజర్వేషన్‌ను 24శాతం చేయడంతో ఎంతోమంది ఉద్యోగాలు కోల్పోతున్నారన్నారు. కుడిపూడి సత్తిబాబు మాట్లాడుతూ బీసీల మనోభావాలను కాపాడిన ఏకైక పార్టీ టీడీపీ అన్నారు. సమావేశంలో కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి మాట్లాడుతూ బీసీల కులవృత్తులను చంద్రబాబు పూర్తిగా ఆదరించారని రాజకీయంగా కూడా బీసీలకు అధిక ప్రాధాన్యమిచ్చేది టీడీపీ అన్నారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ నాయకులు నురుకుర్తి వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి సత్య, మరుకుర్తి నాగబాబు, తేజాయాదవ్, మాసుమేని గంగయ్య, కాకరపల్లి సత్యవతి, చలపతి, వాసంశెట్టి అంజనేయులు, జయకృష్ణ, మోహన్, బీమాబత్తుల సత్యనారాయణ, చొల్లంగి వేణుగోపాల్, రామకృష్ణ, కళ్యాణ్, సూర్యప్రకాష్ అధిక సంఖ్యలో బీసీ నాయకులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో 'నవ్య' సేవలు ప్రారంభం

- ఏఐ ద్వారా క్యాన్సర్ రోగులకు మెరుగైన వైద్యంపై సూచనలకు అవకాశం



ట్రీట్‌మెంట్ రికమండేషన్స్‌ను వివరిస్తున్న డాక్టర్ ఉమేష్

జీజీహెచ్(కాకినాడ), జనవరి 19: కాకినాడ జీజీహెచ్‌లో క్యాన్సర్ రోగుల సౌలభ్యం కోసం నవ్య ప్రాజెక్ట్ పరిధిలో సేవలు ప్రారంభమయ్యాయి. వీటిని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్య కుమారి, హోమిబాబా క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ ఉమేష్ మహంతశెట్టి, రేడియేషన్ అంకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ శ్రీనివాసన్, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, కాంప్రహెన్సివ్ కేన్సర్ కేర్ స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్‌బాబు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమేష్ మాట్లాడుతూ హయ్యర్ సెంటర్లకు, సెకండ్ ఒపీనియన్లకు వెళ్లే క్రమంలో క్యాన్సర్ బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నవ్య ప్రాజెక్ట్ అందుబాటులోకి రావడంతో వారి ప్రయాసలు తొలగిపోయాయని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్ట్‌కు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను జోడించామని తెలిపారు. డాక్టర్ లావణ్యకుమారి మాట్లాడుతూ జీజీహెచ్‌లో క్యాన్సర్ విభాగ సేవలు ఎంతగానో ప్రసిద్ధి పొందాయన్నారు. నిష్ణాతులైన వైద్యనిపుణులు జీజీహెచ్‌లో అందుబాటులో ఉన్నారన్నారు. వారి వైద్య చికిత్సా నైపుణ్యానికి అదనంగా నవ్య ప్రాజెక్ట్ పరిధిలోని సేవలు రోగులు సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. డాక్టర్ శ్రీనివాసన్ మాట్లాడుతూ నవ్య పరిధిలో సేవలు పొందే రోగులు తమ పేర్లను నమోదు చేసుకునేందుకు సంబంధిత వైద్యవర్గాల అనుమతి తప్పనిసరన్నారు. అలా పేర్లను నమోదు చేసుకున్న రోగులు సెకండ్ ఒపీనియన్లకు హయ్యర్ సెంటర్లకు వెళ్లే అవసరం లేకుండా జాతీయస్థాయిలో నిపుణులైన కేన్సర్ వైద్యులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా జీజీహెచ్ అంకాలజీ వైద్యనిపుణులకు అందుబాటులోకి వచ్చి మరింత మెరుగైన లైన్ ఆఫ్ ట్రీట్‌మెంట్‌ను సూచిస్తారన్నారు. ఇరువైపులా నిపుణుల చొరవతో రోగులకు నాణ్యమైన క్యాన్సర్ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. సుదూరాలకు వెళ్లి ప్రయాణ బడలిక, ఖర్చు వంటి ప్రయాసలు నవ్య ప్రాజెక్ట్‌తో తీరిపోనున్నాయని డాక్టర్ శ్రీనివాసన్ వెల్లడించారు. డాక్టర్ రమేష్ మాట్లాడుతూ నవ్య ప్రాజెక్ట్ అందుబాటులోకి వచ్చేందుకు డీఎంఈ డాక్టర్ నరసింహం, డాక్టర్ లావణ్యకుమారి, డాక్టర్ శ్రీనివాసన్ ఎంతగానో కృషి చేశారన్నారు. ప్రతిఏడాది క్యాన్సర్ సంబంధిత వైద్యసేవలు, పరికరాలకోసం ప్రభుత్వం రూ.600కోట్లు ఖర్చు చేస్తోందని అందులో జిల్లా ఆస్పత్రులకు తగిన వాటా కేటాయించారన్నారు. నవ్య ప్రాజెక్ట్ ద్వారా క్యాన్సర్ రోగుల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడి ఆయుర్దాయం మరింత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి రోగికి నవ్య పరిధిలో నమోదు చేయడం జరగదని అవసరాన్ని బట్టి వారికి వైద్యసేవలు అందిస్తున్న అంకాలజీ నిపుణులు, హెచ్‌వోడీ నిర్ధయించి నవ్యకు నమోదు చేయిస్తారని తెలిపారు. నవ్య కార్యకలాపాలు కొనసాగించేందుకు జీజీహెచ్‌లోని ప్రత్యేక కార్యాలయం ప్రారంభించారు. అందులో కంప్యూటర్ సహా ఉపకరణాలు, సిబ్బంది అందుబాటులోనికి తీసుకొచ్చారు. తొలుత నిర్వహించిన నివేదికల పరిశీలనలో తొలిరోజు పదిమంది రోగులను నవ్య ప్రాజెక్ట్‌లోకి అప్‌లోడ్ చేశారు. వారి ఆరోగ్యానికి సంబంధించిన నివేదికలు జాతీయ వైద్య నిపుణుల నుంచి జీజీహెచ్‌కు చేరగా వాటిపై డాక్టర్ ఉమేష్ జీజీహెచ్ వైద్యులకు తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దేవీమాధవి, ఆర్థో హెచ్‌వోడీ డాక్టర్ ఎంపీఆర్ విఠల్, వివిధ విభాగాల వైద్యనిపుణులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్లు.. అప్పులపాలు!

- అసంపూర్తి పనులతో షేర్ వాల్ టెక్నాలజీ ఇళ్లు
- పూర్తి చేసేందుకు రూ.లక్ష అదనంగా ఖర్చు
- సామర్లకోటలో సీఎం ప్రారంభించి మూడునెలలైనా స్వాధీనపరచని వైనం.. ఆందోళనలో లబ్ధిదారులు



సామర్లకోటలో షేర్‌వాల్ టెక్నాలజీలో నిర్మించిన ఇళ్లలో అసంపూర్తిగా ఉన్న లోపలి భాగం

సామర్లకోట, జనవరి 19: ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా నిర్మించి ప్రారంభించిన జగనన్న గృహ నిర్మాణాలు పూర్తిస్థాయిలో లబ్ధిదారుల అవసరాలను తీర్చలేక, సాక్షాత్తూ సీఎం జగన్ ప్రారంభించిన గృహాలు నేటికీ స్వాధీనం చేయకపోవడంతో లబ్ధిదారులు ప్రైవేట్ ఇళ్లకు అద్దెలు చెల్లించలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం గృహ నిర్మాణానికి ఇస్తున్న రుణానికి 8రెట్లు తమ సొంత సొమ్ములు చెల్లించి మాత్రమే అధిక సంఖ్యలో ఇళ్లను నిర్మించుకోగా వాటినే ప్రభుత్వం తాము నిర్మించినట్లు గొప్పగా ప్రకటనలు గుప్పించారు. వాటికి సామూహిక గృహప్రవేశాలు పేరిట మున్సిపాల్టీకి చెందిన లక్షలాది రూపాయల నిధులు ఖర్చుచేసి ప్రారంభించారు. అదే సమయంలో ఇళ్ల నిర్మాణాలు లక్ష్యం సాధించామని గొప్పలు చెప్పుకునేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన రుణం మొత్తానికి లబ్ధిదారుల వాటాగా మరో రూ.35 వేలు వసూలు చేసి షేర్‌వాల్ టెక్నాలజీ పేరిట సామర్లకోటలో నిర్మించిన ఇళ్లను మూడు నెలలు కావస్తున్నా నేటికీ వాటిని లబ్ధిదారులకు స్వాధీనం చేయలేదు. దీంతో కొందరు లబ్ధిదారులు ఒకడుగు ముందుకు వేసి అసంపూర్తిగా ఉన్న షేర్‌వాల్ టెక్నాలజీ ఇళ్లను స్వాధీనం చేసుకుని అసంపూర్తిగా వదిలివేసిన పనులను మరో రూ.లక్ష వెచ్చించి పూర్తి చేసుకుని వాటిలో నివాసం ఉంటున్నారు.

ఎవరికి చెప్పుకోవాలో తెలియక..

షేర్‌వాల్ టెక్నాలజీలో సీఎం ప్రారంభించే నాటికి అనగా మూడు నెలల క్రితం 159 ఇళ్లను నిర్మించినట్లు ప్రభుత్వం ప్రకటించినా శుక్రవారం నాటికి వాటిలో పదిగృహాల్లో మాత్రమే లబ్ధిదారులు నివసిస్తున్నారు. మిగిలిన అన్ని ఇళ్లు అసంపూర్తిగా వదిలివేయడంతో లబ్ధిదారులు తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక కాళ్లరిగేలా తిరుగుతున్నారు. షేర్‌వాల్ టెక్నాలజీ విధానంలో ఇళ్లను నిర్మించేందుకు లబ్ధిదారులు ఒక్కొక్కరినుంచి రూ.35వేలను వసూలు చేసి ఒక ప్రైవేట్ కాంట్రాక్టర్‌తో ఈ విధానంలో ఇళ్లను నిర్మించారు. సీఎం జగన్ జగనన్న కాలనీ ప్రారంభించేనాటికి 159 ఇళ్లను పూర్తి చేశామని నాటి సభలో గొప్పలుగా ప్రకటనలు గుప్పించారు. తదనంతరం వాటిని లబ్ధిదారులు చూస్తే లోపల ఎటువంటి విద్యుద్దీకరణ పనులు కానీ, ప్లాస్టింగ్ కానీ గోడలు కానీ నిర్మించకుండా అసంపూర్తిగా దర్శనమిచ్చేసరికి లబ్ధిదారులు అవాక్కయ్యారు. ఈ గృహాలపై స్పష్టమైన సమాచారం ఇచ్చేందుకు ఇళ్ల నిర్మాణ కాలంలో పనిచేసిన హౌసింగ్ డీఈ, ఏఈలను విధుల నుంచి తప్పించడం, దొడ్డిదారిన సచివాలయ సిబ్బందికి గృహనిర్మాణ విధులు అప్పగించడంతో వారి నుంచి కూడా సరైన సమాచారం లేక లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ఇక చేసేదేమీ లేక అసంపూర్తిగా ఉన్న షేర్‌వాల్ టెక్నాలజీ ఇళ్లను కొందరు లబ్ధిదారులు స్వాధీనం చేసుకుని లోపల సదుపాయాలను ఏర్పాటు చేసుకునేందుకు, నిర్మాణ పనులు పూర్తి చేసుకునేందుకు ఒక్కొక్కరూ రూ.80వేల నుంచి రూ.లక్ష వరకూ వెచ్చించారు. మొత్తం 159 ఇళ్లను నిర్మించినట్లు నాడు ఇళ్ల ముందు భాగంలో పూలదండలు, అరటి చెట్లతో అలంకరించినా వాటిలో 125ఇళ్ల వరకూ నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. ప్రభుత్వ ఉన్నతాధికారి ప్రమేయంతో షేర్‌వాల్ టెక్నాలజీతో ఇళ్లను నిర్మించేందుకు పనిచేసిన కాంట్రాక్టరు పత్తా లేకుండా పోవడంతో ఎక్కడి పనులు అక్కడే చందాన తయారైందని లబ్ధిదారులు వాపోతున్నారు. కాలనీలో మౌలిక సదుపాయాలైన డ్రైన్లు, సీసీరోడ్లు, వీధిలైట్లు, మున్సిపల్ తాగునీరు, చెత్త తొలగించేందుకు పారిశుధ్య చర్యలు వంటి సదుపాయాలు లేవు. దీంతో ప్రతి ఇంటి ముందూ మురుగుకంపుతో ఈగలు, దోమల వ్యాప్తి చెందుతున్నాయి.

రూ.లక్ష వరకూ ఖర్చు పెట్టి అప్పులపాలయ్యా: పాలిక మంగ

ప్రభుత్వం నాకు స్థలం ఇచ్చింది. ఇల్లు కూడా వాళ్లే నిర్మిస్తామన్నారు. నావంతు వాటాగా రూ.35వేలు వసూలు చేశారు. షేర్‌వాల్ టెక్నాలజీ విధానంలో ఇల్లు నిర్మించారు. సీఎం ప్రారంభించిన తర్వాత ఇల్లు ఇస్తామన్నారు. రెండు నెలలు గడిచినా ఇల్లు స్వాధీనం చేయకపోవడంతో నేను ఇంటిని స్వాధీనం చేసుకోగా లోపలి భాగంలో కనీసం ప్లాస్టింగ్ పనులు, విద్యుద్దీకరణ పనులు సైతం చేయలేదు. అప్పు చేసి రూ.లక్షలతో ఇంటి అసంపూర్తి పనులన్నీ చేయించి ఇంట్లోకి మకాం పెట్టాను. ప్రభుత్వ వైఖరి వల్ల నేడు అప్పులపాలయ్యాను.

22న ఓటర్ల తుది జాబితా ప్రచురణ: కలెక్టర్



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

కాకినాడ సిటీ, జనవరి 19: ఈసీఐ, సీఈవో మార్గదర్శకాలకు అనుగుణంగా ఈనెల 22న ఓటర్ల తుది జాబితా ప్రచురణకు చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కృతికాశుక్లా ఆదేశించారు. వెలగపూడి సచివాలయంనుంచి సీఈవో ముకేష్‌కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనికి కాకినాడ కలెక్టరేట్‌నుంచి కలెక్టర్ కృతికాశుక్లా.. వివిధ నియోజకవర్గాల ఈఆర్వోలతో కలిసి హాజరయ్యారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024, ఓటర్ల తుది జాబితా ప్రచురణ, ఎన్నికల సిబ్బంది డేటా బేస్, ఆర్వో, ఏఆర్వోలకు శిక్షణ, పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాల కల్పన, జాతీయ ఓటర్ల దినోత్సవం అంశాలపై సీఈవో సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ ఈఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 26న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బూత్ స్థాయి వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. షెడ్యూల్ ప్రకారం ఆర్వో, ఈఆర్వోల శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేయాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి డీఆర్వో కె.శ్రీరమణి, పెద్దాపురం, తుని, జగ్గంపేట, ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గాల ఈఆర్వోలు, కాకినాడ అర్బన్, పిఠాపురం తహసీల్దార్‌లు సీతాపతిరావు, త్రినాథ్‌రావు, ఎన్నికల డీటీ ఎం.జగన్నాథం పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం పెట్టి ఎస్సీల ఓట్లు లాగేయాలని జగన్‌రెడ్డి కుట్ర

- టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొల్లాబత్తుల అప్పారావు ధ్వజం



మాట్లాడుతున్న టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు

కాకినాడ సిటీ, జనవరి 19: విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం పెట్టి ఎస్సీల ఓట్లు లాగేయాలని జగన్‌రెడ్డి కుట్ర పన్నారని, ఈ కుట్రను తెలుసుకోలేని స్థితిలో ఎస్సీలు లేరని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొల్లాబత్తుల అప్పారావు ధ్వజమెత్తారు. జిల్లా టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్సీ సెల్ నాయకులతో కలిసి మాట్లాడారు. గత ఎన్నికల్లో ఎస్సీల ఓట్లతో నెగ్గి అధికారంలోకి వచ్చాక ఎస్సీల సంక్షేమ పథకాలన్నీ రద్దు చేసిన దళిత ద్రోహి జగన్‌రెడ్డి అని అన్నారు. అంబేడ్కర్ విగ్రహం పెట్టి జగన్ ప్రత్యేకంగా గుర్తింపు ఇవ్వక్కర్లేదని, ప్రపంచవ్యాప్తంగా ఆయనకు ఏనాడో గుర్తింపు లభించిందని తెలిపారు. 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం పెట్టడంవల్ల ఎస్సీలకు ప్రయోజనం చేకూరిందేమీలేదన్నారు. ఎస్సీల సంక్షేమ పథకాలు రద్దు చేసి ఆర్థికంగా, సామాజికంగా 125ఏళ్లు వెనక్కి గెంటేసిన జగన్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో ఎస్సీలే ఇంటికి పంపేస్తారని హెచ్చరించారు. కాకినాడ నగర ఎస్సీ సెల్ అధ్యక్షుడు సీకోటి అప్పలకొండ, జిల్లా ఉపాధ్యక్షుడు పలివెల రవి అనంతకుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా ఎస్సీలకు కల్పించిన రిజర్వేషన్లను జగన్‌రెడ్డి కాలరాశారని, రాబోయే ఎన్నికల్లో జగన్‌రెడ్డిని దళితులే గద్దె దింపేస్తారని అన్నారు. సమావేశంలో నగర ఉపాధ్యక్షుడు బంగారు సత్యనారాయణ, సామంతుల నాగేంద్ర, పంపన బాలప్రకాష్ పాల్గొన్నారు.

పొర్లుదండాలతో అంగన్‌వాడీల నిరసన



హామీలు అమలు కోరుతూ అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. 39వ రోజు ఆందోళనలో భాగంగా ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట పొర్లుదండాలతో వినూత్న రీతిలో ఇలా నిరసన తెలిపారు.

- 6లో

ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాశాఖ అధికారుల తనిఖీలు

- సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే నోటీసులు జారీ చేస్తాం: డీఐ

కాకినాడ రూరల్, జనవరి 19: పాఠశాల విద్య కమిషనర్ ఉత్తర్వులను ఉల్లంఘించి పదో తరగతి విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో కాకినాడ రామారావుపేటలోని నారాయణ పాఠశాలలో విద్యాశాఖాధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించినట్లు కాకినాడ అర్బన్ డీఐ వీపీజీ వాణికుమారి తెలిపారు. డీవైఈవో ఆర్జే డేనియల్‌రాజు ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టగా పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుల ఇంట్లో తరగతులు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో పాఠశాలకు సమీపంలోఉన్న ఉపాధ్యాయుల ఇళ్లలోనూ, పాఠశాలలోనూ తనిఖీలు నిర్వహించామన్నారు. ఆర్జేడీ, ఇన్‌చార్జ్ డీఈవో నాగమణి ఆదేశాలను లెక్కచేయకుండా తరగతులు నిర్వహించడంపై పాఠశాల ప్రిన్సిపాల్‌కు నోటీసులు జారీచేసి చర్యలు తీసుకుంటామని డీఐ తెలిపారు. విద్యాశాఖ అధికారులు పాఠశాలకు రావడంతో విద్యార్థులను ఇళ్లకు పంపించేశారని, ఎవరైనా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

రా.. కదలిరా..!

నేడు మండపేటలో చంద్రబాబు భారీ బహిరంగ సభ

▸▸ లక్ష మంది జన సమీకరణే లక్ష్యంగా టీడీపీ, జనసేన ఏర్పాట్లు ▸▸ టీడీపీలో చేరనున్న వైసీపీ నేతలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

రా.. కదిలిరా.. ప్రభంజనంలా తరలిరా.. అంటూ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం పార్లమెంటు స్థాయిలో మండపేట కేంద్రంగా శనివారం నిర్వహించే 11వ భారీ బహిరంగ సభకు తెలుగుదేశం, జనసేన సమాయత్తమవుతున్నాయి. భారీఎత్తున జనాన్ని తరలించడానికి నియోజకవర్గాల్లో ఇరు పార్టీల కేడర్లు పోటీపడుతున్నాయి. ఈ సభను విజయవంతం చేయడం ద్వారా టీడీపీ ఎన్నికల నగారాను ఇక్కడి నుంచే మోగించనుంది. కోనసీమ జిల్లా పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి వేల సంఖ్యలో జనసమీకరణ చేయనున్నారు. ఇందుకోసం టీడీపీ నియోజకవర్గానికో పరిశీలకుడిని నియమించింది. వారితోపాటు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, టీడీపీ టిక్కెట్లు ఆశిస్తున్నవారు జనసమీకరణ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మండపేట-ఆలమూరు రోడ్డులోని బాబుఅండ్‌బాబు కన్వెన్షన్ హాలు పక్కన గల సభాస్థలిలో మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగ సభ ప్రారంభం కానుంది. వేదికపై చంద్రబాబుతోపాటు సుమారు 72 మంది ఆశీనులయ్యేలా ఏర్పాట్లుచేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని ముగ్గురు పొలిట్ బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, జనసేన ఇన్‌చార్జిలు, పార్టీ ముఖ్య నేతలతోపాటు 18 విభాగాలకు చెందిన అనుబంధ సంస్థల అధ్యక్షులను వేదికపైకి ఆహ్వానించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సభ ప్రారంభానికి ముందు సాంస్కృతిక ప్రదర్శనలు కూడా నిర్వహించనున్నారు. జన సమీకరణలో భాగంగా ప్రైవేటు వాహనాలు, కార్లతోపాటు చుట్టుపక్కల నియోజకవర్గాల వారు మోటారు సైకిళ్లపై తరలివచ్చేందుకు వీలుగా టీడీపీ, జనసేన నేతలు కృషి చేస్తున్నారు. ఈ సభను పెద్దఎత్తున విజయవంతం చేసేందుకు టీడీపీ జిల్లా నాయకత్వంతోపాటు అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జి గంటి హరీష్ మాధుర్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. చంద్రబాబునాయుడు సమక్షంలో వైసీపీకి చెందిన కీలక నేతలు టీడీపీలో చేరనున్నారు. శెట్టిబలిజ యువనేత, అమలాపురం పట్టణానికి చెందిన వాసంశెట్టి సుభాష్ వేలాదిమంది అనుచరులతో అమలాపురం నుంచి భారీ ర్యాలీగా మండపేట వెళ్లి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరతారు. కాకినాడలో ప్రసిద్ధి చెందిన సత్య స్కాన్ సెంటర్ నిర్వాహకుడు కాదా వెంకటరమణ, మలికిపురం మండలం మోరికి చెందిన చింతా వీరభద్రరావులతోపాటు హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఒకరు టీడీపీలో చేరతారని తెలిసింది.


బాబు సభ ఏర్పాట్లకు భూమిపూజ చేస్తున్న బండారు, వేగుళ్ల తదితరులు

పర్యటన సాగేదిలా..

చంద్రబాబు అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు విలేజ్‌లోని డుంబ్రిగూడ నుంచి శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు బయల్దేరి కోనసీమ జిల్లా మండపేట బైపాస్ రోడ్డులో ఏర్పాటుచేసిన హెలిపాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన బహిరంగ సభాస్థలికి 3.15 గంటలకు చేరుకుంటారు. సాయంత్రం 4.30 గంటల వరకు సభలో పాల్గొంటారు. అనంతరం సభాస్థలి నుంచి బయలుదేరి బైపాస్ రోడ్డులోని హెలిపాడ్‌కు చేరుకుని అక్కడి నుంచి 5.05 గంటలకు బయలుదేరి రాజమహేంద్రవరంలోని మధురపూడి ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. విమానంలో బయలుదేరి బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి జూబ్లీహిల్స్‌లోని తన నివాసానికి వెళతారు.


మండపేటలోని చంద్రబాబునాయుడు బహిరంగ సభ జరిగే ప్రదేశంలో శుక్రవారం రాత్రి వేదిక ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం



మండపేటలో టీడీపీ ప్రభుత్వ హయాంలో పెద్దసంఖ్యలో నిర్మించిన టీడ్కో గృహాలు.. అవే భవనాలకు వైసీపీ రంగులు మార్చి వదిలివేయడంతో అధ్వాన దుస్థితి

టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లకు మోక్షమేదీ

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం

మండపేట, జనవరి 19: మండపేట పట్టణంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో గృహాలు నేటివరకు లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో వైసీపీ ప్రభుత్వం అందజేయలేదు. ఫేజ్1లో నిర్మించిన 4,064 గృహాల్లో ఇప్పటివరకు కేవలం 2,700 మందికి మాత్రమే ఇళ్లను అందించారు. మరో 1300 మందికి ఫేజ్1లో ఇవ్వాల్సి ఉంది. ఐదేళ్లగా లబ్ధిదారులు సొంతింటికోసం ఎదురుచూపులు చేస్తున్నారు. మరోపక్క ఫేజ్2లో నిర్మించిన 2 వేల గృహాలకు సంబంధించి పనులు పూర్తయినప్పటికీ మౌలిక వసతులు కల్పించకపోవడం, బ్యాంకు రుణాలు మంజూరుకాకపోవడం వంటి కారణాల వల్ల నేటికీ టిడ్కో గృహాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఇప్పటికే ఆ గృహాల్లో ఉంటున్న వారికి మౌలిక వసతులు సరిగా లేకపోవడంతో అష్టకష్టాలు పడుతున్నారు. ఒక్క నిర్మాణం చేయకుండా కేవలం భవనాల రంగుల మార్చిన ప్రస్తుతం ప్రభుత్వం.. ఎప్పటికి మిగిలిన వాటిని వినియోగంలోకి తెలుస్తుందో చూడాలి.


గాడ్‌ను సత్కరిస్తున్న కాశీ వేద పండితులు


గాడ్ సమక్షంలో సత్కారం అందుకున్న గరికపాటి, సాహితీవేత్తలు

హైందవ సనాతన ధర్మవ్యాప్తికి గాడ్ కృషి అభినందనీయం

టీటీడీ ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు

రాయవరం, జనవరి 19: హైందవ సనాతన ధర్మవ్యాప్తికి వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి గాడ్ చేస్తున్న కృషి అభినందనీయమని టీటీడీ ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు అన్నారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి 88వ జన్మదిన వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ప్రసార భారతీ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.అనంత పద్మనాభరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో వేణుగోపాల దీక్షితులు, ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, సాగరఘోష కవి గరికపాటి నరసింహారావు, మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ, యర్రప్రగడ రామకృష్ణ తదితరులు మాట్లాడారు. హిందూ ధర్మ పరిరక్షణకు పీఠాధిపతులు, మఠాధిపతులు చేస్తున్న సేవలను కొనియాడడంతోపాటు మనిషి ధర్మపథంలో ఎలా నడవాలనేది రాముడు మనకు చూపాడన్నారు. అయోధ్యలో సీతారాముల ప్రతిష్ఠ సందర్భంగా రాముడి ఆశీస్సులు ప్రజలందరికీ కలగాలన్నారు. పీఠాధిపతి గాడ్ భక్తులనుద్దేశించి ప్రసంగం చేస్తూ ప్రతి మనిషి దైవారాధన చేయడం ద్వారానే మానసిక ప్రశాంతత లభించడంతోపాటు చింతలు తొలగుతాయన్నారు. విజయదుర్గా విశిష్ట సేవా పురస్కారాన్ని అనపర్తికి చెందిన ప్రముఖ నేత్ర వైద్యుడు తేతలి సత్యానారాయణరెడ్డి, మస్తానమ్మ దంపతులకు అందజేశారు. పీఠాధిపతి గాడ్‌కు తిరుమల, కాశీ, అన్నవరం దేవస్థానాల నుంచి తీసువచ్చిన ప్రసాదాన్ని అందజేసి వేదాశీస్సులు వేదపండితులు అందజేశారు. ప్రముఖ వస్త్రవ్యాపారి తుమ్మిడి రామ్‌కుమార్, జీఎస్ఎల్ అధినేత గన్ని భాస్కరరావు, వారణాశి శృంగేరి శంకరమఠం మేనేజర్ చల్లా అన్నపూర్ణప్రసాద్, వారణాశికి చెందిన ఆధ్యాత్మికవేత్త చల్లా జగన్నాథ శాస్త్రి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పిఠాపురం మండలం భోగాపురంలో నాటిక పోటీల్లో ప్రదర్శించిన రాత నాటికలోని ఓ దృశ్యం.. నాటిక పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భోగాపురంలో ముగిసిన జాతీయ నాటికల పోటీలు


పిఠాపురం, జనవరి 19: కాకినాడ జిల్లా పిఠాపురం మండలం భోగాపురంలో మూడు రోజులపాటు నిర్వహించిన జాతీయ స్థాయి నాటికల పోటీలు శుక్రవారంతో ముగిశాయి. భోగాపురం కళాపరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా నాన్నా నేనొచ్చేస్తా(గుంటూరు) ఎంపికకాగా, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా రాత(వెలగలేరు), తృతీయ ప్రదర్శనగా అమృతహస్తం(గుంటూరు), ఉత్తమ జ్యూరీ ప్రదర్శనగా కొత్త తరం కొడుకు(కొండెవరం), ఉత్తమ రచనగా తాళాబత్తుల వెంకటేశ్వరరావు, ఉత్తమ దర్శకుడిగా పి.శ్రీనివాసరావు, ఉత్తమ నటుడిగా ఎంవీ రాజర్షి, ఉత్తమ నటిగా అమృతవర్షిణి, ఉత్తమ ప్రతినాయకుడిగా వై.హరిబాబులు ఎంపికయ్యారు. వీరందరికీ కళాపరిషత్ అధ్యక్షుడు అడపా సూరిబాబు తదితరులు నగదు పురస్కారాలు, బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేతలుగా జలదంకి సుధాకర్, ఎండీ ఖాజావలీ, యం.చిన్నారావులు వ్యవహరించారు. ఇక నాటికల పోటీలు చివరి రోజున ప్రదర్శించిన నాటికలు అందరినీ ఆలోచింపజేశాయి. ఏడు అడుగులు కలిసి వేసి జంటలో ఎవరయినా ఎనిమిదో అడుగు వేయాలని ప్రయత్నిస్తే ప్రాణాంతకమవుతుంది. ఆలుమగలు మధ్య చిన్న చిన్న అంతరాలు ఉన్నా అర్థం చేసుకోవడం ద్వారా వాటిని సరిచేసుకుంటే ఆ బంధం కడదాకా ఉంటుందనే సందేశాన్ని ఇస్తూ హైదరాబాదుకు చెందిన జయా ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించి ఎనిమిదో అడుగు నాటిక సాగింది. మాడభూషి దివాకరబాబు రచించిన ఈ నాటికకు డాక్టర్ శ్రీజ సాధినేని దర్శకత్వం వహించారు. తాను పొందాల్సినవి మంచిగా పొందుతూ తిరిగి ఇవ్వాల్సిన వాటి విషయంలో మనిషి బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్న తీరుని వివరిస్తూ ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం వెలగలేరుకు చెందిన వెలగలేరు ఆర్ట్ థియేటర్స్ కళాకారులు ప్రదర్శించిన రాత నాటిక ఆసక్తికరంగా సాగింది. మనిషికి కష్టం కలిగితే నా రాతింతే అనుకోవడం, సుఖం వస్తే మాత్రం రాతను వదిలేస్తాడనే ఈ నాటికను పి. శ్రీనివాసరావు రచించి దర్శకత్వం వహించారు.



వర్క్‌షాపులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సురేష్, చైర్మన్ శేషుమాధవ్

రైతు వంగడాలు, హక్కుల పరిరక్షణపై వర్క్‌షాపు

రాజమహేంద్రవరం రూరల్, జనవరి 19: రాజమహేంద్రవరంలోని కేంద్ర పొగాకు పరిశోధనా కేంద్రంలో శుక్రవారం రైతు వంగడాలు, హక్కుల పరిరక్షణ అనే అంశంపై వర్క్ షాపు నిర్వహించారు. దీనికి ఐసీఏఆర్-సీటీఆర్ఐ డైరెక్టర్, ఇన్స్టిట్యూట్ టెక్నాలజీ మేనేజ్మెంట్ యూనిట్ చైర్మన్ డాక్టర్ ఎం.శేషుమాధవ్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా వ్యవసాయ కళాశాల పీజేటీఎస్ఏయూ హైదరాబాద్ ప్రొఫెసర్ జె.సురేష్ విచ్చేశారు. అలాగే మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.భారతిలక్ష్మి, ఎన్జీఆర్‌యూ వ్యవసాయ కళాశాల రాజమహేంద్రవరం హెడ్ సి.శ్యాంరాజ్ నాయక్, జిల్లా వ్యవసాయాధికారి ఎం.మాధవరావు, ఐఐఎంఆర్ రీసెర్చ్ స్టేషన్ పెద్దాపురం హెడ్ మునిరత్నం, డాక్టర్ జి.రామనందం, సీనియర్ శాస్త్రవేత్త కె.రవీంద్రకుమార్, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానం డాక్టర్ పి.లలిత కామేశ్వరి, వేమగిరి ఐసీఏఆర్-డీఎఫ్ఆర్ శాస్త్రవేత్తలు, వివిధ పరిశోధన సంస్థల శాస్త్రవేత్తలు, సీటీఆర్ఐ విభాగాల అధిపతులు, రైతులు, రైతు ఉత్పత్తిదారులు హాజరయ్యారు. మొక్కల రక్షణ, రైతులు హక్కుల అథారిటీ వంగడాల ప్రాముఖ్యతను, నూతన రైతు వంగడాలు అంశాలపై డాక్టర్ కె.సరళ మాట్లాడారు. ఎం.శేషుమాధవ్ సంస్థ పరివర్తన గురించి ప్రస్తావించారు. జియోగ్రాఫికల్ ఇండికేషనల్(జి1) అనే అంశంపై చర్చించారు.



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

రెస్టారెంట్లు, ఫుడ్ సెంటర్లపై విజిలెన్స్ దాడులు.. కేసులు నమోదు

నమూనాలు లేబొరేటరీకి

రాజమహేంద్రవరం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఆహార పదార్థాలు విక్రయించేవాళ్లు ప్రజారోగ్యం దృష్ట్యా తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని.. ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ సురేశ్‌బాబు హెచ్చరించారు. శుక్రవారం రాజానగరం మండలంలోని పలు రెస్టారెంట్లు, ఫుడ్ సెంటర్లలో విస్తృతంగా ఆకస్మిక సోదాలు చేశారు. జగన్నాథపురం (జె.అగ్రహారం)లోని ఫుడ్ పిరమిడ్‌లో గడువు ముగిసిన ఆహార పదార్థాలు, స్టాంపింగ్‌లేని వేయింగ్ మిషన్, 44 టేస్టింగ్ సాల్ట్ ప్యాకెట్లు, బిల్లుల్లో జీఎస్టీ నమోదు చేయకపోవడం గుర్తించామని ఎస్పీ తెలిపారు. జీఎస్ఎల్ సమీపంలోని హ్యాబిటేట్‌లో నిల్వ ఉన్న 21 సోయా సాస్ బాటిల్స్ గుర్తించామన్నారు. కేసు నమోదు చేయడంతోపాటు చికెన్ బిర్యానీ నమూనాలు సేకరించి ఫుడ్ లేబొరేటరీకి పంపించామన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నూనెలో టోటల్ పోలార్ కాంపౌండ్స్ 25శాతంలోపు ఉండాలని కానీ చాలా రెస్టారెంట్లలో ఉపయోగిస్తున్న నూనెలో పరిమితి మించుతోందన్నారు. నూనెను ఎక్కువసార్లు ఉపయోగించడం వల్ల హాని జరుగుతోందని, అది ప్రజారోగ్యానికి హానికరమన్నారు. రెస్టారెంట్లు, బార్లు, ఫుడ్‌సెంటర్లు, హోటళ్ల కిచెన్లు, పరిసరాలు కచ్చితంగా పరిశుభ్రంగా ఉండాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని కోరుతున్నామన్నారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన తనిఖీల్లో డీఎస్పీ ముత్యాలనాయుడు, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరెడ్డి, నాగవెంకట రాజు, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, ఏవో భార్గవ మహేశ్, డీసీటీవో షబ్బీర్, ఎస్ఐ జగన్నాథరెడ్డి, హెచ్‌సీ జీవానందం, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

మూడు కాసుల బంగారు ఆభరణాలు చోరీ

అనపర్తి, జనవరి 19: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అనపర్తి మండలంలోని కుతుకులూరులో మూడు కాసుల బంగారు ఆభరణాలు చోరీ జరిగినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు. కుతుకులూరులో కర్రి వెంకట రామారెడ్డి తన తల్లితో కలిసి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఈనెల 15వ తేదీన గ్రామంలో జరిగే ముగ్గుల పోటీలు తిలకించేందుకు తన తల్లి వెళ్లడంతో ఇంట్లో బీరువాలో ఉన్న మూడు కాసుల బంగారు ఆభరణాలు చోరీకి గురయినట్టు గుర్తించి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీటి విలువ సుమారు లక్ష రూపాయల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామారావు తెలియజేశారు.


అయోధ్య రాముల వారికి కల్యాణ కొబ్బరి బొండాలను అందిస్తున్న రామారెడ్డి దంపతులు

అయోధ్యకు మండపేట కొబ్బరి బొండాలు

మండపేట, జనవరి 19: అయోధ్యలో ఈనెల 22న జరిగే అయోధ్య రామమందిర ప్రారంభోత్సవానికి సంబంధించి శ్రీరాములు వారికి బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన కేవీ రామారెడ్డి దంపతులు తయారుచేసిన కల్యాణ కొబ్బరి బొండాలను గురువారం అయోధ్యలో రామమందిర ట్రస్టు నిర్వాహకులకు అప్పగించామని రెడ్డి దంపతులు శుక్రవారం తెలిపారు. తాము భద్రాచలం రాముల వారి కల్యాణానికి బొండాలు అందిస్తున్నామని, ఇప్పుడు అయోధ్య రామమందిరానికి బొండాలు అందించడం ఆనందంగా ఉందని తెలిపారు.


ట్వంటీ ఫస్ట్ సెంచరీ సంస్థతో ఎంవోయూ చేసుకుంటున్న నన్నయ అధికారులు

గ్రూప్-2 పరీక్షల శిక్షణకు నన్నయ ఎంవోయూ

దివాన్‌చెరువు, జనవరి19: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థులకు గ్రూపు-2 పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చేందుకు ట్వంటీ ఫస్ట్ సెంచరీ ఎడ్యుకేషనల్ సొసైటీకి నన్నయ వర్సిటీ మధ్య అవగాహన ఒప్పందం పునరుద్ధరించామని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. శుక్రవారం విశ్వవిద్యాలయంలో ఎంవోయూ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ నన్నయ విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థులకు, పూర్వ విద్యార్థులకు గ్రూప్-2 పోటీపరీక్షలకు సంబంధించి శిక్షణ అందించేందుకు ట్వంటీఫస్ట్ సెంచరీ ఎడ్యుకేషనల్ సొసైటీ ముందుకు వచ్చిందన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు ప్రోగ్రాం కోఆర్డినేటర్ టి.హైమావతిని సంప్రదించాలని కోరారు. విద్యార్థులను ఎంపికచేసి శిక్షణా తరగతులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. తొలుత రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ట్వంటీ ఫస్ట్ సెంచరీ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ వీవీవీ కృష్ణప్రదీప్ ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేసి మార్చుకున్నారు. సొసైటీ సీఈవో కె.ధరణి, సీనియర్ సివిల్స్ మెంటార్ బి.అభినవ్‌శ్రీకాంత్, నన్నయ విశ్వవిద్యాలయం ప్రోగ్రాం కోఆర్డినేటర్ టి.హైమావతి పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ జి.నాగమణి

నేటి నుంచి 24 వరకూ జాతీయ టెన్నిస్ పోటీలు

23 రాష్ట్రాల నుంచి 109 మంది క్రీడాకారుల రాక : ఆర్జేడీ నాగమణి

కాకినాడ రూరల్, జనవరి 19: పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ టెన్నిస్ పోటీలు శనివారం ప్రారంభమై ఈనెల 24 వరకూ కొనసాగుతాయని పాఠశాల విద్య జోన్2 ఆర్జేడీ, కాకినాడ జిల్లా ఇన్‌చార్జి డీఈవో జి.నాగమణి తెలిపారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆర్జేడీ మాట్లాడుతూ అండర్-19 పాఠశాల క్రీడా సమాఖ్య పురుషుల టెన్నిస్‌పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు వెల్లడించారు. పోటీలకు 23 రాష్ట్రాల నుంచి 109 మంది క్రీడాకారులు హాజరవుతున్నారన్నారు. పోటీల నిర్వహణ నిమిత్తం కాకినాడ డీఎస్ఏ, పాత ఎస్పీ కార్యాలయం వెనుక, డీమార్ట్ సమీపంలోని సింథటిక్ టెన్నిస్‌కోర్టులను ఫ్లడ్‌లైట్లతో సిద్ధంచేసినట్టు తెలిపారు. పోటీల నిర్వహణకు కలెక్టర్ కృతికాశుక్లా, జేసీ ఇలాక్కియా ఆదేశాల మేరకు వివిధ కమిటీలను ఏర్పాటుచేశామన్నారు. శనివారం సాయంత్రం 4 గంటలకు డీఎస్ఏలో పోటీలు ప్రారంభమవుతాయని పాఠశాల క్రీడాసమాఖ్య రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తిరాజు తెలిపారు. పోటీల నిర్వహణ నిమిత్తం రాష్ట్ర క్రీడాసమాఖ్య నిధుల నుంచి రూ.6 లక్షలు మంజూరుచేశామన్నారు. 46 మంది కోచ్‌లు, 100 మంది స్థానిక అఫీషియల్స్ పోటీల నిర్వహణలో పాల్గొంటున్నారని తెలిపారు. సమావేశంలో పాఠశాల క్రీడాసమాఖ్య కార్యనిర్వహణా కార్యదర్శి బీవీవీఎస్వీ ప్రసాద్, డీవైఈవోలు ఆర్జే డేనియల్‌రాజు, డి.సుభద్ర, డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్, పీడీలు రంగారావు, రవిరాజు, బంగార్రాజు, కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు. ఏపీ జట్టుకు క్రీడాదుస్తులను ఆర్జేడీ అందజేశారు.


నమాజ్‌కని బయలుదేరి.. కానరాని లోకాలకు

కారు ఢీకొని చికెన్ వ్యాపారి మృతి


రామ్‌తుల్లా (ఫైల్)

కరప, జనవరి 19: ప్రతీరోజు మాదిరిగానే వ్యాపారం ముగించుకుని నమాజ్ చేసుకోవడానికి బయలుదేరిన ఒక వ్యక్తిని కారు ఢీకొనడంతో కానరాని లోకాలకు తరలిపోయాడు. కాకినాడ జిల్లా కరపలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బిక్కవోలు మండలం పందలపాక గ్రామానికి చెందిన షేక్ రామ్‌తుల్లా(50) కొన్నేళ్ల కిందట కరప వచ్చి కుటుంబంతో కలిసి జీవిస్తున్నాడు. స్థానిక స్వర్ణ థియేటర్ వద్ద ఇద్దరు కుమారులతో కలిసి చికెన్ షాపును నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. వ్యాపారం ముగించుకుని పెనుగుదురు మసీదులో నమాజ్ చేసుకోవడానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరగా కాకినాడ నుంచి రామచంద్రపురం వైపు వెళ్తున్న గుర్తుతెలియని కారు వేగంగా వచ్చి రామ్‌తుల్లాను బలంగా ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. తన చికెన్‌షాపు సమీపంలోనే జరిగిన ఈ ప్రమాదంలో రామ్‌తుల్లా తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం జరిగింది. క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. నవ్వుతూ, అందరితో కలుపుగోలుతనంగా ఉండే రామ్‌తుల్లా కళ్ల ముందే రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో సహచర వ్యాపారులు షాక్‌కు గురయ్యారు. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి చేర్చినట్టు కరప ఎస్ఐ తుపాటి రామకృష్ణ తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారును గుర్తించామని, నిందితుడిని అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ చేపడతామని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో గిరిజన యువకుడు మృతి



అడ్డతీగల, జనవరి19: అడ్డతీగల మండలం మళ్ళవరం మామిళ్ళ గ్రామ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భీమవరం పంచాయతీకి చెందిన శరత్‌రెడ్డి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం శరత్‌రెడ్డి రాజమహేంద్రవరం నుంచి గురువారం రాత్రి తన స్వగ్రామం భీమవరం వెళుతుండగా మళ్ళవరం మామిళ్ల సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో రాజమహేంద్రవరం తరలిస్తుండగా మార్గమధ్యలో శరత్‌రెడ్డి మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సత్యదేవుడి సన్నిధిలో సాంస్కృతికశాఖ సంయుక్త కార్యదర్శి పూజలు

అన్నవరం, జనవరి 19: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో సాంస్కృతిక శాఖ సంయుక్త కార్యదర్శి నందూరి ఉమస్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆమెకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. పండితులు వేదాశీర్వచనం అందజేశారు.

నేడు నవోదయా ప్రవేశ పరీక్ష

పెద్దాపురం, జనవరి 19: జవహర్ నవోదయా ఆరవ తరగతిలో ప్రవేశానికి ఈనెల 20న ప్రవేశపరీక్షను నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ ఆర్.కమలం తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా 37 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశామని, 8506 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్టు తెలిపారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకూ పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లను రిజిస్ట్రేషన్ నంబర్ లేదా పుట్టినతేదీ ఆధారంగా నవోదయా వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9441829056, 9441008830, 944756148, 9704248269 నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

తపోవన క్షేత్రానికి కాశీ క్షేత్ర ప్రధాన అర్చకులు

తుని రూరల్, జనవరి 19: ప్రముఖ ఆధ్యాత్మిక పీఠం తపోవనం క్షేత్రానికి కాశీ క్షేత్ర ప్రధాన అర్చకులు ఓం ప్రకాస్ మిశ్రా బృందం విచ్చేశారు. క్షేత్ర పీఠాధిపతులు శ్రీ సచ్చిదానందసరస్వతి స్వామిజీ దర్శనం అనంతరం అయోధ్య శ్రీరాముని ప్రతిష్ఠ పురస్కరించుకుని సీతారామ సమేత ఆంజనేయస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారు, శివునికి ప్రత్యేక పూజలు చేశారు

స్థానికులకే ఇళ్ల స్థలాలు కేటాయించాలి

చొల్లంగి గ్రామస్తుల ఆందోళన

తాళ్లరేవు, జనవరి 19: చొల్లంగి సర్వే నెంబర్ 47/3లో 4.42సెంట్లు సాల్ట్ డిపార్ట్మెంటుకు చెందిన కేంద్రప్రభుత్వ భూమిలో స్థానికులకే ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలు ఇవ్వాలని చొల్లంగి గ్రామస్తులు శుక్రవారం ఆ స్థలంలో ఆందోళన చేపట్టారు. స్థానికులు రాపాక సత్యనారాయణ, బొబ్బర అప్పన్న మాట్లాడుతూ చొల్లంగిలో ఉన్నవాళ్లకు ఊరుగాని ఊరులో పట్టాలిచ్చి స్థానికంగా ఖాళీగా ఉన్న భూములను ఇతర మండలం వాసులకు కట్టబెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చొల్లంగివాళ్లకు 210 మంది ఉప్పుటేరు పక్కన ఇచ్చి, మరో 80మందికి జి.వేమవరం, పటవలలో పట్టాలు ఇచ్చారని తెలిపారు. ఇంకా స్థలాల లబ్ధిదారులు 200మంది ఉన్నారని వారికి స్థానికంగా స్థలాలివ్వాలని, స్థానికేతరులకు చొల్లంగిలో ఇస్తే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. నాయకులు కట్టా త్రిమూర్తులు, గర్రే లక్ష్మీనారాయణ, స్థానికులు వారా సూర్యకుమారి, మేడపాటి దేవానందం, కొంకి రాజు, బొడ్డు చంటి, పి.త్రిమూర్తులు ఉన్నారు.

'కులగణన సర్వే సమగ్రంగా నిర్వహించాలి'

కరప, జనవరి 19: మండల పరిధిలో గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది చేపట్టిన కులగణన సర్వే ఇంటింటికి వెళ్లి ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా సమగ్రంగా నిర్వహించాలని ఎంపీడీవో కె.అప్పారావు సూచించారు. అరట్లకట్టలో శుక్రవారం ఆయన పర్యటించి కులగణన సర్వే ప్రారంభించి ఎన్యూమరేటర్లకు సర్వే ఎలా నిర్వహించాలో తెలిపారు. కుల గణన సర్వే అనేది రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు లెక్కల మాత్రమేనని, దీని వల్ల ఎవరికి ఏహానీ జరగదన్నారు. మండలంలో 21 గ్రామ పంచాయతీల పరిధిలో ఈ సర్వే ప్రారంభించామని, 28లోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. గ్రామ సర్పంచ్ గోపి సత్యవేణి, గ్రామకార్యదర్శి వి.సునీల్ కుమార్ ఉన్నారు.

'బీసీల పట్ల సీఎం అభిమానం చాటుకోవాలి'

కాకినాడ సిటీ, జనవరి 19: విజయవాడలో నిలువెత్తు అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసి ఎస్సీల పట్ల అభిమానం చాటుకున్న సీఎం జగన్ బలహీనవర్గాల ఆశా జ్యోతి జ్యోతీరావ్‌పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేసి బీసీల పట్ల అభిమానం చాటుకోవాలని రాష్ట్ర బీసీ సంఘం ఉపాధ్యక్షుడు యనమదల రవి కోరారు. బీసీల అభ్యున్నతికి పూలే చేసిన కార్యక్రమాలను ప్రజలకు తెలియజేసేలా స్మృతి వనాన్ని ఏర్పాటు చేయాలన్నారు.

'కాంగ్రెస్ బలోపేతానికి కృషి'

ప్రత్తిపాడు, జనవరి 19: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలంతా ఐక్యంగా కృషి చేయాలని పీసీసీ సభ్యుడు ధర్నాల కోట శ్రీను కోరారు. శుక్రవారం కాంగ్రెస్ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజును అధిష్ఠానం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా నియమించడం పట్ల హర్షం వెలిబుచ్చారు. పళ్లంరాజు నాయకత్వంలో పార్టీ పురోభివృద్ధికి కార్యకర్తలు, నాయకులు నడుం కట్టాలన్నారు. దాసరి సత్తిబాబు, కందిమళ్ళ శామ్యేల్, గజేంద్ర సూరిబాబు ఉన్నారు.

నెహ్రూను కలిసిన గుమ్మడి అన్నవరం

జగ్గంపేట రూరల్, జనవరి 19: మండలంలోని ఇర్రిపాక శివాలయం వద్ద టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూను కాకినాడ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుమ్మడి అన్నవరం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన అంతం చేయడానికి నియోజకవర్గంలోని ఎస్సీలందరూ టీడీపీకి మద్దతుగా ఇవ్వాలని కోరుతూ నియోజకవర్గంలోని ఎస్సీ సెల్ నాయకులతో కలిసి నెహ్రూను మర్యాదపూర్వకంగా కలిశామన్నారు. కార్యక్రమంలో మన్నేపల్లి సుబ్రహ్మణ్యం, జగ్గంపేట మండల ఎస్సీసెల్ అధ్యక్షులు మన్నేపల్లి రాంబాబు, రేపల్లి చందు, మన్నేపల్లి బాలరాజు, తైం కొనరాజు, రబ్బల సతీష్‌కుమార్, మన్నేపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

22న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, జనవరి 19: వికాస కార్యాలయంలో ఈనెల 22న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. పలు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తారన్నారు. ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్, పీజీ, ఉత్తీర్ణులైన 30ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. వారికి నెలకు రూ.12వేల నుంచి రూ.25వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాల ఆధారంగా ఉంటుందన్నారు. అభ్యర్థులు ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయానికి సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని.. వివరాలకు 8297400777, 8297400666లో సంప్రదించాలన్నారు.

టీడీపీ ప్రొఫెషనల్స్ ప్రధాన కార్యదర్శిగా చిటికెల

ప్రత్తిపాడు, జనవరి 19: కాకినాడ పార్లమెంటరీ టీడీపీ ప్రొఫెషనల్స్ విభాగం ప్రధాన కార్యదర్శిగా ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన చిటికెల శ్రీనివాస్ నియమితులయ్యారు. శుక్రవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరపు అచ్చెంనాయుడు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. శ్రీనివాస్‌ను నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభరాజా అభినందించారు. ప్రొఫెషనల్స్ విభాగంలో మరింతసేవలు అందించాలన్నారు.

అధిక ధరలకు మద్యం విక్రయాలు

గొల్లప్రోలు రూరల్, జనవరి 19: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మద్యం బాటిల్స్‌పై ఎమ్మార్పీలు వేర్వేరుగా ఉన్నా అధిక ధర ఉన్న మొత్తాన్నే వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. తాను శుక్రవారం గొల్లప్రోలు మండలం దుర్గాడలో గల ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద రెండు క్వార్టర్ విస్కీ బాటిల్స్ కొనుగోలు చేసినట్లు గ్రామానికి చెందిన అబ్బిరెడ్డి సూర్యనారాయణ తెలిపారు. సదరు బాటిల్స్‌పై ఎమ్మార్పీ ఒక దానిపై రూ.200 ఉండగా, మరొక దానిపై రూ.220గా ఉందని చెప్పారు. తన వద్ద రూ.420 తీసుకోవాల్సి ఉందని తెలిపారు. అయితే తక్కువ ఎమ్మార్పీ ఉన్న బాటిల్‌కు అదనంగా రూ.20 మొత్తం రూ.440 తన వద్ద తీసుకున్నారని చెప్పారు. ప్రశ్నిస్తుంటే ధర పెరిగిందని చెబుతున్నారని తెలిపారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లోనే ఎమ్మార్పీ కంటే అధిక ధరలు వసూలు చేస్తే ఎలాగని ఆయన ప్రశ్నించారు.

సారాతో వ్యక్తి అరెస్ట్

సర్పవరం జంక్షన్, జనవరి 19: కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేటలో అక్రమంగా నాటుసారా విక్రయిస్తున్న మేడిశెట్టి వెంకటరమణను అరెస్ట్ చేసి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ కాకినాడ నార్త్ సీఐ కె.రామమోహనరావు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు దాడులు చేసి నిందితుడి అరెస్ట్ చేశామని, ఏక్టివా స్కూటీని సీజ్ చేశామన్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించగా జడ్జి 15 రోజులు రిమాండ్ విధించడం జరిగిందన్నారు.

మద్యంతో వ్యక్తి అరెస్ట్

రౌతులపూడి, జనవరి 19: రౌతులపూడి మండలంలోని ఎస్.అగ్రహారం గ్రామ శివారున అక్రమ మద్యాన్ని రౌతులపూడి ఎస్ఐ అబ్దుల్ నబీ పట్టుకున్నారు. ఎన్ఎన్.పట్నం గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణను అదుపులోకి తీసుకుని 180 ఎమ్ఎల్ 45 బ్రాందీ సీసాలను స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

వనదుర్గ ఆలయంలో ఘనంగా చండీహోమం

అన్నవరం, జనవరి 19: రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9 గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తసతి పారాయణలు, మూలమంత్ర జపములు పఠించారు. అనంతరం 11 గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేద పండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



అన్నవరంలో హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

జగన్‌కు మంచిబుద్ధిని ప్రసాదించాలి

» అంబేడ్కర్ విగ్రహాల వద్ద అంగన్‌వాడీల నిరసనలు » పొర్లుదండాలతో ఆందోళన



తాళ్లరేవులో అంబేడ్కర్ విగ్రహం వద్ద చేతులు జోడించి వేడుకుంటున్న అంగన్‌వాడీలు



పెద్దాపురంలో అంగన్‌వాడీల నిరసన

తాళ్లరేవు, జనవరి 19: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించేలా అంబేడ్కరయ్యా సీఎం జగన్‌రెడ్డికి మంచిబుద్ధిని ప్రసాదించాలని కోరుతూ తాళ్లరేవు మండల ప్రజాపరిషత్ ఆవరణలో గల అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం అంగన్‌వాడీలు నిరసన తెలియజేశారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం ప్రారంభోత్సవం సందర్భంగా విచ్చేస్తున్న జగన్‌రెడ్డి మనసును మార్చాలని అంగన్‌వాడీలు చేతులు జోడించి అంబేడ్కర్‌ను వేడుకున్నారు. టీడీపీ, జనసేన, సీపీఎం ప్రజాసంఘాల నేతలు సంఘీభావం తెలిపారు.

పెద్దాపురం: తమ న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చకపోతే వచ్చే ఎన్నికల్లో జగన్ భవిష్యత్తును నిర్ణయించేది తామేనని అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు దాడి బేబీ అన్నారు. స్థానిక మున్సిపల్ జంక్షన్ వద్ద అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిరసనలో బేబీ మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన జగన్ ఆయన ఆశయాలను మాత్రం తుంగలో తొక్కుతున్నారన్నారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాగమణి, అమల, ఎస్తేరురాణి, అంగనవాడీ యూనియన్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో అంగన్‌వాడీలు తహశీల్దార్ కార్యాలయం ఎదుట 39వ రోజు ఆందోళనలో భాగంగా పొర్లుదండాలతో వినూత్నరీతిలో నిరసన చేపట్టారు. శిబిరంలో నేలపై పొర్లుదండం పెట్టి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తక్షణం అంగన్‌వాడీల వేతనం పెంపుదల చేసి ఇతర సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. అంగన్‌వాడీ సంఘ నాయకురాళ్ళు అల్లాడి లక్ష్మి, సీహెచ్.హేమలత, తులసి, నాగ సత్యవతి పాల్గొన్నారు.

తుని రూరల్: ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలని తుని అర్బన్, రూరల్ అంగన్‌వాడీ హెల్పర్లు స్పష్టం చేశారు. చంటిపిల్లలతో సమ్మెలో రోడ్డుపై ఉన్నామని, ప్రభుత్వం తమ నిరసనను పరిగణలోకి తీసుకోకుండా అడుగడుగునా ఇబ్బందులు సృష్టించి భయాభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. జగన్ రానున్న ఎన్నికల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

కిర్లంపూడి: కిర్లంపూడిలో అంగన్‌వాడీల సమ్మె కొనసాగింది. తమ డిమాండ్లు పరిష్కారం అయ్యే వరకు సమ్మె విరమించబోమని అంగన్‌వాడీ సంఘ మండలాధ్యక్షురాలు రత్నం డిమాండ్ స్పష్టం చేశారు.

కరప: కరప తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు కొనసాగిస్తున్న నిరసన దీక్ష 39వ రోజుకు చేరుకుంది. స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆందోళనలో నాయకులు పి.వీరవేణి, ఎం.భవానీ, బి.అచ్చారత్నం, ఆర్.దైవకుమారి, ఎస్.వరలక్ష్మి, జీఏకేఏఎల్ నారాయణమ్మ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు



జగ్గంపేట మండలం మన్యంవారిపాలెంలో టీడీపీలో చేరినవారితో జ్యోతుల నెహ్రూ



కోటనందూరు: యనమల సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ కార్యకర్తలు

జగ్గంపేట రూరల్, జనవరి 19: మండలంలోని మన్యంవారిపాలెం, గోవిందపురం గ్రామాల నుంచి వివిధ కులాలకు చెందిన కొండ్రపు ప్రసాద్, నెమ్మది నరసింహమూర్తి, మొగిలి రమణ, గోవిందపురం గ్రామం నుంచి వార్డు సభ్యురాలు చంద్రమళ్ళ నాగమణి, నాయకులు కూడెల్లి దేన, సిద్దబత్తుల నాగన్న, కోడి లోవరాజు, పలువురు వైసీపీ కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో విచ్ఛిన్నం చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించడానికి ప్రజలందరూ ఎదురుచూస్తున్నారన్నారు. అసమర్థ ప్రజా ప్రతినిధి వల్ల ఇక్కడ రైతులకు అపారనష్టం కలిగిందని, సకాలంలో తాళ్ళూరు లిఫ్టు పని చేసే ఉంటే రైతులకు ఇంత నష్టం కలిగేది కాదన్నారు. గోవిందపురంలో మాట్లాడుతూ నేను గెలిచిన వెంటనే మల్లవరం ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి 3 గ్రామాలకు ప్రతి ఎకరానికి నీరందిస్తానని నెహ్రూ అన్నారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, కొత్త కొండబాబు, పైడిపాల సూరిబాబు, రేఖ బుల్లిరాజు, సర్వసిద్ధి లక్ష్మణరావు, వెలిశెట్టి శ్రీను, కుంచే తాతాజీ, బుద్ది సురేష్, తోట వెంకటేశ్వరరావు, కొసిరెడ్డి శ్రీను, సుంకవిల్లి రాజు, నకిరెడ్డి సూర్యవతి, పోతురా కృష్ణ, పోతు రాముడు, బొడ్డుబుజ్జి, మీసాల సత్తిబాబు, మరోతి సూర్యచంద్ర ఉన్నారు.

శృంగరాయునిపాలెంలో...

కిర్లంపూడి: శృంగరాయునిపాలెంలో వైసీపీని టీడీపీకి సుమారు 100 మందికిపైగా చేరారు. శృంగరాయునిపాలెం గ్రామ సర్పంచ్ పట్టు చంటిబాబు, ఎంపీటీసీ గరగ గోవిందు, ఉపసర్పంచ్ బత్తుల శ్రీను, పలువురు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ సమక్షంలో ఆ పార్టీ కండువాలు కప్పుకున్నారు. నెహ్రూని గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్‌డీపేటలో...

కోటనందూరు: ఎల్‌డీపేటకు చెందిన 100 మంది వైసీపీ కార్యకర్తలు దళిత, కాపులు టీడీపీ సీనియర్ నేత పెనుమచ్చు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు అధ్యక్షతన, తుని నియోజక వర్గ ఇన్‌చార్జి యనమల దివ్య రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు సమక్షంలో టీడీపీలో చేరారు. పెనుమచ్చ వీర్రాజు, పెపనుమచ్చ తిరుపతియ్య, పెనుమచ్చ కొండాబాబు, చక్కా సింహాచలం, నర్సిపూడి రాజు, మాసా నాగేశ్వరరావుకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మేతుకూరి వెంకటేష్, డి.చిరంజీవి రాజు, షేక్‌నావాబ్‌జానీ, పెనుమచ్చు నాగూర్, లెక్కల భాస్కర్, చింతకాయల రవికుమార్, గెడ్డాడ లాజర్,ఎడిది శంకరరావు పాల్గొన్నారు.

ఘోరంగా సీఎం జగన్ తీరు

ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి సత్యప్రభ

ప్రత్తిపాడు, జనవరి 19: దళిత యువకుడు కోడికత్తి శ్రీనివాస్ సంఘటనలో సీఎం జగన్ రెడ్డి తీరు ఘోరంగా ఉందని ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ రాజా విమర్శించారు. కోడి కత్తి దాడి కేసులో జగన్ కోర్టుకు హాజరుకాకుండా శ్రీనివాస్ జీవితం నాశనం చేయడం దారుణమని మండిపడ్డారు. ప్రత్తిపాడులో శుక్రవారం ఆమె మాట్లాడుతూ జగన్ ప్రతిపక్షనేతగా ఉన్న సమయంలో వైజాగ్ విమానాశ్రయంలో కోడికత్తితో శ్రీనివాస్ దాడి చేస్తే చంద్రబాబే హత్యాయత్నం చేశానని జగన్ నానా యాగి చేశారని మండిపడ్డారు. విమానాశ్రయ వైద్యులు చిన్నపాటి గాయమని చెప్పినా హైదరాబాద్ వెళ్లి 3 కుట్లు పడ్డాయని జగన్ ప్రచారం చేసుకున్నారని, కోడి కత్తి డ్రామా వాడుకుని జగన్ సానుభూతి కోసం వెంపర్లు ఆడి అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. దళిత యువకుడిని తన డ్రామా కోసం వాడుకుని ప్రతిపక్షంలో ఉండగా విచారణ చేపట్టాలని కోరిన జగన్ అధికారంలోకి వచ్చి 5 ఏళ్లు గడుస్తున్నా కేసును పట్టించుకోకపోవడం, కోర్టుకు హాజరుకాకపోవడం యువకుడి జీవితాన్ని నాశనంచేయడమే అవుతుందన్నారు.

టీడీపీ నిరసన ప్రదర్శన



సామర్లకోట, జనవరి 19: వైసీపీ ప్రభుత్వంలో దళితులపై జరుగుతున్న దమనకాండకు నిరసనగా, గత ఐదేళ్లగా జైల్లో మగ్గిపోతున్న కోడి కత్తి శ్రీనుకు మద్దతుగా సామర్లకోట టీడీపీ నాయకులు మఠం సెంటర్ ఎన్టీఆర్ విగ్రహం ఎదుట శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. కోడి కత్తి శ్రీనుకు న్యాయం చేయాలని నినాదాలు చేసారు. వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేఖంగా ప్లకార్డులతో నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, టీడీపీ దళిత నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో దళితుల ధర్నా

ప్రత్తిపాడు, జనవరి 19: కోడికత్తి కేసులో దళిత యువకుడు శ్రీనివాస్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. అంబేడ్కర్ కళామందిర్ సెంటర్‌లో దళితులు ధర్నా చేసి వినతిపత్రం అందజేశారు. దళితుడైన శ్రీనివాస్ జైలు నుంచి విడుదలయ్యేందుకు జగన్ చర్యలు తీసుకోవాలని కోరారు. మాజీ సర్పంచ్ మూరాసత్యనారాయణ వరప్రసాద్, దళితనేతలు శెట్టిబత్తుల వీరబాబు, మూరా చిన్ని ఉన్నారు.

పైప్‌లైన్‌ను వెంటనే తొలగించాలి

» మత్స్యకారుల ఆందోళన » టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ మద్దతు



ఆందోళనలో మత్స్యకారులు, వర్మ

కోనపాపపేట (కొత్తపల్లి), జనవరి 19: రసాయన పరిశ్రమల వ్యర్థాలను పైప్‌లైన్ ద్వారా సముద్రంలోకి విడుదల చేసేందుకు ఏర్పాటుచేసిన పైప్‌లైన్‌ను వెంటనే తొలగించాలని పొన్నాడ శివారు కోనపాపపేట మత్స్యకారులు శుక్రవారం రెండోరోజు మెయిన్‌రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. శీలంవారిపాలెం నుంచి ఆందోళనకారులు రోడ్డును దిగ్బంధం చేశారు. మత్స్యకార కుటుంబాలు మెయిన్‌రోడ్డుపై బైఠాయించి వంటా-వార్పు చేపట్టారు. పిల్లలు,పెద్దలు కలిసి భోజనాలు చేశారు. సముద్రాన్ని నమ్ముకుని జీవనోపాధి పొందుతున్న తమకు రసాయన కంపెనీలు ఇచ్చే నష్టపరిహారం వద్దని, విషపూరితమైన రసాయనాలు సముద్రంలోకి పంపే పైప్‌లైన్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. మత్స్యకారుల ఆందోళనకు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ మద్దతు తెలిపారు. తీరంలో నెలకొల్పే లైఫిజ్ ఫార్మా కంపెనీకి చెందిన రసాయనాలను సముద్రంలోకి పంపేందుకు ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌ను తక్షణం తొలగించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు మత్స్యకారుల ఉద్యమాన్ని అణకతొక్కే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మత్స్యకారుల న్యాయమైన పోరాటాన్ని అణచివేసే దిశగా పోలీసులు, అధికారులు కానీ ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వర్మ హెచ్చరించారు. ఆందోళనలో మత్స్యకారుల నాయకులు కొర్ని వెంకటరమణ, ఉమ్మిడి గోవిందు, కె.గంగరాజు, పల్లేటి బాపన్నదొర, కంబాల దాసు, మేరుగు సూరిబాబు, టీడీపీ కొత్తపల్లి మండలాధ్యక్షులు అనిశెట్టి సత్యానందరెడ్డి, సత్యనారాయణరెడ్డి, కడిమిశెట్టి చక్రయ్య పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీసీలకు అన్ని విధాలా అన్యాయం

తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య



సమావేశంలో మాట్లాడుతున్న యనమల దివ్య

తొండంగి, జనవరి 19: రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీలకు అన్ని విధాలా తీరని అన్యాయం జరిగిందని తుని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య అన్నారు. శుక్రవారం యర్రయ్యపేటలో జరిగిన బీసీల సమావేశంలో ఆమె మాట్లాడారు. టీడీపీ బీసీ కులాలకు అన్ని రంగాల్లో సమున్నతమైన స్థానం కల్పించిందని తద్వారా బీసీల పార్టీగా గుర్తింపు పొందిందన్నారు. వైసీపీ మాత్రం బీసీలను అణిచి వేస్తూ వారిని అన్ని విధాలుగా అణగదొక్కుతోందన్నారు. తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు యనమల శివ రామ కృష్ణ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తూ అన్ని విధాలుగా హింసిస్తోందన్నారు. బీసీ కులాలన్నీ దీనిని గమనిస్తున్నాయని, రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన మండలాధ్యక్షులు చొక్కా అప్పారావు, బెండపూడి నాయుడు, పేకేటి హరికృష్ణ,చొక్కా కాశీశ్వరావు, వనపర్తి రాజా పాల్గొన్నారు. అంతకు ముందు ఒంటిమామిడి నుంచి యర్రయ్యపేట వరకూ బీచ్ రోడ్‌పై బైక్ ర్యాలీ చేపట్టారు.

అరట్లకట్టలో ఆరోగ్య సురక్ష

కరప, జనవరి 19: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అమలు చేస్తున్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సత్యవేణి అన్నారు. అరట్లకట్టలో జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆరోగ్య సురక్షన రెండో విడత కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. మండల వైద్యాధికారి ఆర్.శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ వైద్య శిబిరానికి 189 మంది పురుషులు, 123 మంది మహిళలు వచ్చారన్నారు. వారికి డాక్టర్ ప్రసాద్, అరుణకుమారి, యాంజిలిన్ వైద్య పరీక్షలు నిర్వహంచారు. ఎంపీడీవో అప్పారావు, గ్రామ కార్యదర్శి సునీల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

పిఠాపురం, జనవరి 19: పిఠాపురంలోని తబితా ఐడియల్ హైస్కూలులో 1998-99 సంవత్సరంలో పదో తరగతి కలిసి చదువుకున్న విద్యార్థులంతా అదే పాఠశాల వేదికగా తిరిగి కలుసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వృత్తి, వ్యాపార రీత్యా స్థిరపడిన వారంతా సిల్వర్ జూబ్లీ గెట్ టుగెదర్‌కు హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సరదాగా గడిపారు. చదువు చెప్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. ప్రతి తప్పకుండా కలుసుకోవాలని నిర్ణయించుకుని భారమెక్కిన హృదయాలతో వీడ్కోలు చెప్పుకున్నారు.



పిఠాపురంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

సమస్యల వలయంలో మూలగపూడి పీహెచ్‌సీ

రౌతులపూడి, జనవరి 19: మూలగపూడిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు భయం భయంగా వైద్యసేవలందిస్తున్నారు. పీహెచ్‌సీ ప్రారంభించి 7నెలలు మాత్రమే అయినా తూతూ మంత్రంగానే వైద్యసేవలందుతున్నాయి. ఇద్దరు మహిళా వైద్యులను నియమించగా ఒక్కరు 104లో సేవలందిస్తున్నారు. స్టాఫ్ నర్స్‌లు నలుగురు, ల్యాబ్‌టెక్నీషియన్, అటెండర్ ఉండాలి. సచివాలయం ఏఎన్ఎమ్ మాత్రమే ఉన్నారు. దీంతో ఇక్కడ వైద్యులు పరీక్షలు చేస్తూ మాత్రలు మాత్రమే ఇస్తున్నారు. వైద్యపరీక్షలు చేసేందుకు ల్యాబ్ లేకపోవడంతో రోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్య కేంద్రంలో బాత్‌రూమ్ సౌకర్యం లేకపోవడంతో మహిళా వైద్యులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. భవనం శ్లాబ్ పెచ్చులూడుతుండడంతో భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారులు మెరుగైన సేవలందించాలని ప్రజలు కోరుతున్నారు.



పెచ్చులూడుతున్న భవనం స్లాబ్

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: నా సామిరంగ, సైంధవ్, గుంటూరు కారం, హనుమాన్

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: నా సామిరంగ, సైంధవ్, గుంటూరు కారం, హనుమాన్

తిరుమల	:	సైంధవ్
లక్ష్మి	:	గుంటూరు కారం
సీ అండ్‌సీ1	:	గుంటూరు కారం
సీ అండ్‌సీ2	:	హనుమాన్
శ్రీప్రియ	:	నా సామిరంగ
పద్మప్రియ	:	గుంటూరు కారం
సత్యగౌరి	:	నా సామిరంగ
సూర్య 1	:	గుంటూరు కారం
సూర్య 2	:	హనుమాన్

నేటి నుంచి ఉరుస్ షరీఫ్ గంధోత్సవం

పెద్దాపురం, జనవరి 19: పట్టణ శివారులో ఉన్న హజరత్ షేక్ మదీనా పాచ్చా ఔలియా, హజరత్‌షా రహమతుల్లా వార్ల ఉరుస్ షరీఫ్ గంధోత్సవం ఈనెల 20 నుంచి 22 వరకూ ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు దర్గా కమిటీ అధ్యక్షుడు మహ్మమద్ లాయక్ అలీ తెలిపారు. 350 ఏళ్ల పైబడిన ఘనచరిత్ర కలిగిన ఈ గంధోత్సవానికి రాష్ట్ర నలుమూలల నుంచి కులమతాలకతీతంగా పెద్దసంఖ్యలో వేలాదిగా ప్రజలు తరలిరానున్నారు. ఉత్సవానికి వచ్చే భక్తజనులకు ఏ ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు ఆయన తెలిపారు. అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

ప్రత్తిపాడు, జనవరి 19: ఏలేశ్వరం డిపో పరిధిలోని ప్రయాణికుల సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ బస్సులే ఉత్తమమని డిపో మేనేజర్ డీవీ సత్యనారాయణ చెప్పారు. శుక్రవారం ఆయన స్థానిక పోలీసులతో మాట్లాడుతూ తమ డిపో పరిధిలోని ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు శనివారం సాయంత్రం 4నుంచి 5గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డిపో పరిధిలోని ఏజెన్సీ, మైదాన ప్రాంత ప్రయాణికులు తమ సూచనలు, సలహాలను 9959225532లో తెలియజేయాలన్నారు.

నేడు ఉచిత రక్తదాన శిబిరం

పిఠాపురం, జనవరి 19: పట్టణంలోని వన్‌వే ట్రాఫిక్ రోడ్డులో విష్ణు మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో శనివారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు జనసైనికులు తెలిపారు. నియోజకవర్గ జనసేన నేత డాక్టర్ పిల్లా శ్రీధర్ పుట్టినరోజు సందర్భంగా జరిగే ఈ శిబిరంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకూ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు రక్తదానం చేయాలని కోరారు.

రేపు విశ్వబ్రాహ్మణ సంఘ ప్రమాణం

కిర్లంపూడి, జనవరి 19: కిర్లంపూడిలో వీరబ్రహ్మంస్వామి ఆలయం వద్ద ఆదివారం జిల్లా విశ్వబ్రాహ్మణ నూతన సంఘం ప్రమాణ స్వీకార మహోత్సవం జరుగుతుందని జిల్లా సంఘం అధ్యక్షుడు అత్తిలి వీరబ్రహ్మం తెలిపారు. విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు విజయవంతం చేయాలన్నారు.

ఈవీఎంలపై అవగాహన సదస్సు

జగ్గంపేట రూరల్, జనవరి 19: గుర్రప్పాలెం పంచాయతీ పరిధిలో ఈవీఎంలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఓటు ఎలా వేయాలి, మనం వేసిన ఓటు ఎవరికి వెళ్తుంది, ఓటు వేసే విధానం, ఓటు ఎవరికి వేశారో స్క్రీన్‌పై చూసుకోవడం వంటి విషయాలను ఓటర్లకు వివరించారు. రెవెన్యూ సిబ్బంది రాజకుమార్, కానిస్టేబుల్ రెడ్డి తదితరులున్నారు.

వికసిత్ భారత సంకల్పయాత్ర

ప్రత్తిపాడు, జనవరి 19: ఏలేశ్వరం నగర పంచాయతీలో శుక్రవారం వికసిత్ భారత సంకల్పయాత్ర నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో దేశంలో ప్రవేశ పెట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ అలమండ సత్యవతి చలమయ్య, కౌన్సిలర్లు వెంకటేశ్వరావు, సుంకర రాంబాబు, స్థానిక నాయకులు పండారపు రాంబాబు, కమిషనర్ కె.శ్రీనివాసరావు ఉన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ

కోటనందూరు, జనవరి 19: మండలంలోని కేఈచిన్నాయిపాలెం గ్రామంలో అయోధ్య రామ మందిర అక్షింతలను ఆధ్యాత్మిక, బీజేపీ కార్యకర్తలు ఇంటింటికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు లాలం లోవరాజు, బర్ల అప్పలరాజు, పంపనబోయిన వరహాలు తదితరులు ఉన్నారు.

చీరలు, దుప్పట్ల పంపిణీ

జగ్గంపేట, జనవరి 19: శశి చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పద్మనాభనగర్ వద్ద ఏర్పాటు చేసిన అభయ్ క్షేత్రంలో శుక్రవారంపేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జగ్గంపేట సీఐ లక్ష్మణరావు, ఫౌండేషన్ చైర్మన్ నీలి నరసింహారావు, ఎస్ఐ నాగార్జునరాజు పాల్గొన్నారు.

ఓంకార స్వామి జన్మదిన వేడుకలు రద్దు

ప్రత్తిపాడు, జనవరి 19: మండలంలోని శాంతి ఆశ్రమంలో ఈనెల 21న ఓంకార స్వామి 130వ జన్మదిన వేడుకలను అనివార్య కారణాల వల్ల రద్దు చేసినట్టు ఆశ్రమ నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ఓంకార స్వామి భక్తులు, అభిమానులు, ప్రజలు ఈ విషయాన్ని గుర్తించాలని కోరారు.

నేడు రైతు బజార్ సెలవు

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 19: ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని రైతుబజార్‌లోని ఉల్లిపాయల వ్యాపారి కరీ ముల్లాకాన్ ఈనెల 15న మృతి చెందిన కారణంగా శనివారం రైతు బజార్ రైతు కమిటీ, వర్తక సంఘం సభ్యులు శనివారం రైతు బజార్‌కు సెలవు ప్రకటించారు.